# అర్థం కాని నవమతి

(కథానిక)

"అమ్మాయికి ఎవ్వరూ నచ్చలేదా అని అడగడమే ఎవరు అడిగినా! వాళ్లు ఆశ్చర్య పోతున్నారంటే, వాళ్ళని అనవలసిన పని ఎంత మాత్రమూ లేదు. మనమట్టుకి మనకే తెలుసు అదంతా." అన్నాడు తండ్రి నరహరిశాస్త్రి.

నరహరిశాస్త్రిది బెజవాడ. అతను అంత ఉన్నవాడిలోనూ జమకాదు, లేనివాడిలోనూ జమకాదు. ఏదో సంసార పక్షంగా కాలక్షేపం చేసుకొంటూ వస్తున్నాడు.

ఇంటిలో అందరూ మధ్యాహ్నం భోజనాలు చేసి, తీరుబాటుగా కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు.

"మీరు మరీను! అయినా ఈపాటికి ఏదో ఒకటి చూసి ముడిపెట్టేస్యాక దానినే చూసుకోనియ్యి, దానినే ఎంచుకోనియ్యి దానినే వరించనియ్యి అంటూ కూర్చున్నారు! అదెప్పటికయేను!" అంది భార్య కుందమ్మ కొంచెం చిరాకుగా.

"దాని ఇష్టంవచ్చిన వాళ్ళనికూడ చేసుకోనియ్యరా ఏమిటి ఖర్మ! ఏదో చెప్పినట్లుగా ఉంది" అంది సత్యవతి. ఆమె కాబోయే పెళ్లి కూతురికి అక్క. తల చెడి ఇంటిలో కూర్చుంది.

"దానికీ ఏదో ఒక దరి, అంతు అంటూ ఉండనక్కరలేదుటే?" అన్నాడు ఆమె మేన మామ సోమశంకరం.

"దరేమిటి! అంతేమిటి! ఈతూరి కొట్టి చూడు, ఈతూరి కొట్టిచూడు అన్న కోమటి కథలాగుంది. ఎన్ని సంబంధాలు వచ్చినా అడ్డేస్తూంది. దానిదేం పోయింది. అవస్థలుపడి అణగారే వాళ్ళం మనం. పైగా దానికేం తెలుసనీ?" అంది కుందమ్మ.

"ఒక అవస్థపడ్డ వాళ్ళం కదా, అందుచేత పోనీ దాని కిష్టమైనవాణ్ణే ఎంచుకోనియ్యి అని చూస్తున్నా, కాని యెప్పటికీ కుదరకపోతే? ఇహ యెలాగు చావడం!" తండ్రి ఏమీతోచక అన్నాడు.

"అదుగదే నేనూ అనడం." అంది తల్లి.

"అన్నిటికీ మీ ఇష్టమేనమ్మా. మీరు తలచుకోగానే అన్నీ అయిపోవాలి. ఆగమంటే ఆగాలి, నడవమంటే నడవాలి" అంది అప్పగారైన సత్యవతి చేతులాడిస్తూ.

"నా ఇష్టం నాది" అంది, కాబోయే పెళ్లి కూతురైన నవమతి. ఆ అమ్మాయి చదువు అట్టే చదువుకోలేదు. అంత అందకత్తె కాదు. షోకులకు, నాజూకులకు లోపం లేదు. మనిషి ఆరోగ్యంగా ఉంది.

"ఇహ ఒక మాటు యెంచుకొన్నాక మంచి అయినా, చెడ్డఅయినా పడుండవలసిందే కదా. అందుచేత తొందరలేకుండా సావకాశంగానే యెంచుకోనియ్యండి" అంది సత్యవతి.

"ఆ ఉద్దేశంతోటే యెన్నాళ్ళయినా ఊరుకొన్నాను. కాని దానికీ దరి అంటూ కనబడకుండా ఉంది. కిందటి శ్రావణమాసంలో వచ్చిన సంబంధం యెంత మంచిదో చూడండి! పిల్లవాడు మనకి నచ్చేడు. ఆస్తిపాస్తులు ఉన్నవాడు. అటువంటిది ఇట్టే తేలగొట్టేసింది" అన్నాడు తండ్రి విచారంగా.

"మీకు ఇష్టమైతే అందరికీ ఇష్టమవాలి కామోసు" అంది అక్క.

"నాకు నచ్చేలేదు." అంది నవమతి.

"దానికి ఏమంత లోకానుభవం ఉందని, యెంచుకోడానికీ, మనం దానిమీద విడిచిపెట్టడానికిన్నీ?" అంది తల్లి గట్టిగా.

"ఈడు వచ్చిన పిల్లకదా. దాని ఇష్టం మనం కాదనడమెందుకని పస్తాయిస్తున్నాను గాని" అన్నాడు తండ్రి.

"ఆ శ్రావణమాసంలోనే ఆ తర్వాతవచ్చిన అతను చూడండి! యెంత పెద్దఉద్యోగం చేస్తు

టేకుమళ్ల కామేశ్వరరావు

న్నాడో" అని సోమశంకరం అంటూండగా సత్యవతి అడ్డువచ్చి "వాళ్ల ఇంటిలో ఉండే బలగానికి ఎవరు చాకిరిచేసి పెడతారు" అంది విరుగుడుగా.

"యెవరుచేస్తారు, దిమ్మ చెక్కలలాగు తిని కూర్చుంటే? నేను చెయ్యలేనమ్మా" అంది వనమతి.

"నలుగురు ఉన్నవాళ్ళు ఏమి చేస్తున్నారు, చేసుకోక? అందరికీ నౌకర్లు చాకర్లు వస్తున్నారు కామోసు" అంది తల్లి.

"రెండో పెళ్ళివాడు. ఏమివచ్చె కర్మంగాక పోతే, కర్మమా అని. అంతకంటె అసలు పెళ్లి చెయ్యడమే మానెయ్యరాదూ?" అంది అక్క.

"చివరికి అంతే అవుతుందేమో లే." అంది తల్లి విసుగ్గా.

"ఏమో, మన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాం. ఆ తర్వాత దాని నుదుటి రాత ఎలాగుంటే అలాగు జరుగుతుంది" అన్నాడు తండ్రి.

"అది యెవరు చూడవచ్చేరు! కాని మనం చెయ్యడంలో మాత్రం పిసరంతైనా లోపం ఉండకూడదు" అంది అక్క.

"ఎవరుమట్టుకు అన్ని సుగుణాలు ఒకచోట తెచ్చి కూర్చగలరు. దేనికైనా ఏదో ఒక లోపం ఉండనే ఉంటుంది. పసందైన మామిడి పండుకైనా ముచ్చిక దగ్గర జీడి తప్పదు" అన్నాడు మేనమామ.

"పుట్టినవాళ్లలో ఎంచమన్నాం గాని కొత్తగా సృష్టించమని అడగడం లేదుగా?" అంది సత్యవతి.

"ఇహ అమ్మాయిగారు ఆదారి కూడా తొక్కితే చాలా బాగుంటుంది. కథ యిట్టే తేలిపోతుంది" అంది తల్లి.

"మీదేంపోయింది, చేసుకొన్నవాళ్లు అనుభవిస్తారు. మీరు 'అయ్యో!' అని తల ఒక్కమాటు బాదుకొంటే సరిపోతుంది" అంది అక్క.

"వెనకటివన్నీ వెల్లగించడ మెందుకు?" అన్నాడు మేనమామ.

"ఎవరినీ దెప్పనవసరం లేదు, నువ్వు ఎంచి మంచి సంబంధం తీసుకురాద్దూ!" అన్నాడు తండ్రి, పెద్దకూతురితో.

"మీరంతా ఉండగా తగుదునమ్మా అని ఇహ నేను బయలుదేరాలి." అంది ఆమె వెటకారంగా.

"ఏమిరా, నువ్వు ఏదో ఒకటి చూసి నిశ్చయం చెయ్యరా మరి. ఊరుకుంటే యెలాగవుతుంది?" అంది తల్లి తన తమ్ముడితో.

"నేను తెచ్చిన సంబంధాలే నే, నాలుగు కాదంది, ఏదో వంకపెట్టి" అని సోమశంకరం ఏడవలేక ఎగిరిపడ్డాడు.

"వెనకటివాటిమాట ఎందుకురా ఇప్పుడు?" అంది తల్లి.

"సరే చూద్దాంలేవే." అన్నాడు సోమశంకరం.

"మొత్తంమీద పిల్ల చేస్తూన్న పనులమీద అందరికీ అసహ్యం పుడుతూంది. అంత పరీక్ష ఏమిటి? దిక్కుమాలిన పరీక్ష యిదిన్నూ. మా కాలంలో యిలాంటివి యెప్పుడేనా యెరుగుదుమా? యెవరు మెడలువంచి పుస్తి కడితే వాడే మొగుడు. దానివల్ల మేము చెడిపోయిందేమీ కనబడదు. పైగా బాగుపడ్డాం కాని" అంది తల్లి.

"ఏదో ఒక దారి పట్టేంకదా. ఒక కొసకి వస్తున్నాం" అని, "కాని అది చేతులారా పాడు చేసుకొన్నవాటిని తలచుకొంటూంటే మట్టుకు, దానిని విడిచిపెట్టడం తప్పా యేమిటి చెప్మా అనిపిస్తూంటుంది, మధ్యమధ్య" అన్నాడు తండ్రి, దారీ తెన్నూ తోచనివాడిలాగు.

"తప్పా, తప్పుతన్నరా!" అన్నాడు అతని బావమరిది.

"ఆమాట నిజమే కాని యెంతమాత్రమూ అబద్ధం కాదు" అని తల్లి సమర్థించింది.

"నా కంఠంలో ప్రాణముండగా, దాని ఇష్టంలేనిది నేనుమట్టుకు చెయ్యనియ్యను." అంది అక్కగారు మనోనిశ్చయంతో.

"అయితే అలాగు పడిఉండడమే మంచిది" అన్నాడు మేనమామ.

"అదను వదను ఆగక, తొందర పడితే

ఎలా జరుగుతుంది? అన్నింటికీ చిందులు తొక్కే నీ సరా ఏమిటి" అంది అక్క.

వీథిగుమ్మంలో పోస్టుమాను "సార్!" అని కేక వెయ్యగా, మేనమామ వెళ్ళి ఒక కార్డు తీసుకువచ్చేడు. ఇంటి యజమాని చదవమనగా అతను,

"శ్రీ నరహరి శాస్త్రిగారికి,

మీ కుటుంబం యొక్క ఘనతని గురించి నాకు లోగడ తెలిసింది. గోత్రాదులలో అడ్డు కనపడలేదు. ఏమైనా మనం సమ్ముఖంలో మాట్లాడుకొందాం, ఉత్తరంలో ఎందుకు లెండి. నేను శనివారంనాడు బయలుదేరి వచ్చి, మీ అమ్మాయిని చూసుకొంటాను. అటుపైని భగవదేచ్ఛ.

ఇట్లు,
లోకానందరావు."

అని చదివేడు. తలవని తలంపుగా వచ్చిన సమాచారానికి అందరు సంతోషించేరు. నవమతి ఆనందంలో ఓలలాడింది.

"నేను మీకు అప్పుడే చెప్పానా, నిదానించండి, నిదానించండి, తొందర పడకండి, తొందర పడకండి అని. చివరకు నా మాటే నెగ్గిందా?" అంది సత్యవతి విర్రవీగుతూ.

"వాళ్ళదేవూరు" అని అడిగింది తల్లి.

లేఖచూసి, "నెల్లూరు" అన్నాడు ఆమె తమ్ముడు.

కాబోయే వరుణ్ణి గురించి ఆలోచించడానికి లేఖలో ఉన్నదానికంటె ఒక అక్షరమేనా ఎక్కువగా తెలియదు. కాబట్టి దానిని గురించి చర్చే లేకపోయింది. ఊరుకొన్నారు.

అందరూ సంబంధం యువకుడి కోసం ఉత్కంఠతతో చూస్తున్నారు.

ఆదివారంనాడు లోకానందరావు మెయిల్ దిగేడు. అతని వెంట ఏ సామానూ లేదు. కాగితంలో జాగ్రత్తగా చుట్టబెట్టి తెచ్చిన ఇస్త్రీ కోటు రైలు దిగగానే తొడుక్కొన్నాడు. దారిలోనే హోటలులో కాఫీ పుచ్చుకొని నరహరిశాస్త్రి ఇంటికి చక్కా బయలుదేరేడు.

తాము ఆత్రంగా యెదురుచూస్తున్నందువల్ల గడప యెక్కివచ్చిన వ్యక్తిని చూసి, ఇంటిలో వారు సంబంధ యువకుడని ఇట్టే పోల్చుకొన్నారు. అతను కుర్చీమీద ఆసీనుడయేడు.

లోకానందరావు పంట్లాము, షర్టు, కోటు, బూటు ధరించేడు. నెత్తిమీద పెద్దముడి. చెవులకి కమలాలు వున్నాయి. అతన్ని కిటికీల, తలుపుల సందులోంచి, గోడవారలనుంచి ఆడవాళ్ళు చూస్తున్నారు. చూసీచూడడంతోటే పెదవి విరిచింది సత్యవతి. నవమతి సిగ్గుతో తల యెత్తలేకపోయింది. క్రమంగా సావిటిలోకి తల్లి, మేనమామ వచ్చేరు. తర్వాత సత్యవతి వచ్చింది. అలంకరించుకొని నవమతి వచ్చి ఒక చాపమీద కూర్చుంది. సంబంధ యువకుడు అందరు అడిగిన ప్రశ్నలకు అష్టావధానం చేస్తూ నవమతిని పరిశీలిస్తున్నాడు.

"మీరెంతమంది అన్నదమ్ములు" అని ప్రశ్నించేడు నరహరిశాస్త్రి.

"నలుగురం. పెద్దవాణ్ణి నేనే. ఇంకావాళ్ళకి రెక్కలు రాలేదు. అందుచేత నాదగ్గిరే ఉంటున్నారు. మా తల్లి ఈ కాలపువాళ్ళలాగు గాక ఓపికగల మనిషి. అందరికీ చేసిపెడుతూంది" అన్నాడు లోకానందరావు.

"మీరేమేనా ఉద్యోగం చేస్తున్నారా?" అని మేనమామ అడిగేడు.

"నేను నెల్లూరి లాక్ దగ్గిర సూపర్‌వైజరుగా ఉంటున్నాను."

"వేరే ఆస్తిపాస్తులు" అని నరహరిశాస్త్రి అడుగుతూండగానే, లోకనాధరావు "ఉద్యోగమే సమస్తమున్నూ" అని తేల్చేడు. తర్వాత అతనే "ఉన్న సంగతులన్నీ మీముందు కాకపోతే యెవరిముందు చెప్తాను. నాకుద్వితీయం. కిందటి సంవత్సరమే ఆ అమ్మాయి గతించింది. దానికి సంతానం లేదు" అన్నాడు.

కనుబొమలు యెగరవేశాడు సోమశంకరం.

"కర్మకి ఎవరేంచేస్తారు!" అన్నాడు తండ్రి.

"పెండ్లి యెన్ని దినాలు చేస్తారు?" అని అడిగేడు లోకానందరావు.

"ఏకరాత్రి వివాహమే." అని నరహరిశాస్త్రి జవాబు చెప్పేడు.

"అదే మంచిది. నాకు రెండు రోజులకంటె

సెలవు దొరకదు. అదీ బ్రహ్మాండంమీద, అదైనా ఏళనాదివారలతోటో కలసివస్తే కానా అదృష్ట వంతుణ్ణి" అన్నాడు లోకానందరావు.

"బాగుంది" అన్నాడు నరహరిశాస్త్రి.

ఇంకా ఏదో మంచి చెడ్డా కనుక్కొం టున్నారు నరహరిశాస్త్రి కుటుంబం. తర్వాత కట్నం కొసుల ప్రశంసరాగా "అల్లుడు డబ్బు పేలకొట్టి పుచ్చుకొనే రకంలాగు కనపడు తున్నాడు" అనుకొన్నాడు నరహరిశాస్త్రి. లాంఛనాలన్నీ లోకానందరావే వివరంగా తెలియజేశాడు. చల్లచల్లగా ఉభయఖర్చులూ పెట్టుకొని పెళ్ళి చేయవలసినదిగా తేల్చేడు.

సత్యవతి తాను మేనమామవైపు చూసి కుడి కన్ను యెగరవేసింది. మేనమామ ఇదివరకే చూశాను అన్నట్టుగా బుర్రఆడించి "ఒక పిసరు మెల్ల" అని గొణుగుకొన్నాడు.

సంభాషణ పూర్తి అయింది.

"వెళ్ళివస్తాను" అంటూ లేచి "మీ అభి ప్రాయం తెలియ చెయ్యండి. ఇదిగో నా జాత కం" అంటూ కాగితం అందించేడు లోకా నందరావు.

నరహరిశాస్త్రి పిల్లజాతకం తెచ్చిఇచ్చాడు.

లోకానందరావు నడుస్తూండగా చూశారు. కుడికాలు పట్టిపట్టి వేస్తున్నాడు. వచ్చిన నవ్వు ఆపుకొన్నాడు మేనమామ. అంతా విస్తు పోయేరు. నరహరిశాస్త్రి లోకానందరావుని వీధి చివరిదాక సాగనంపి వచ్చేడు.

"అత్వరిది ముద్దమాటగా ఉంది కని పెట్టి చూశారో లేదో?" అన్నాడు నరహరిశాస్త్రి.

అందరూ తలొక లోపం చెప్పి తెగ నవ్వు కొన్నారు. సత్యవతి నవ్వలేక ఆయాసపడుతూ "ఈ అష్టావక్రుడు మన కెక్కడ దొరికేడమ్మా. మనఖర్మం గాకపోతే." అంది.

ముద్దరాలిలాగు కూర్చుంది నవమతి.

"ఎలాగున్నాడే పిల్లాడు" అని తండ్రి నవ మతిని ప్రశ్నించేడు.

"ఛీ, ఛీ, ఊరుకోండి." అంది సత్యవతి.

"నువ్వు చెప్పవేమే?" అన్నాడు తండ్రి నవమతిని చూసి.

"తుమ్ముకోడం చిరంజీవి అనుకోడం గాక ఇహ నేనెందుకూ?" అంది నవమతి సహం ముడుచుకొని.

"పోనీ నీ అభిప్రాయంకూడా చెప్పుదూ!" అన్నాడు మేనమామ, పెద్ద మేనగోడలివైపు కన్నుగీటుతూ.

"నాకు నచ్చేరు" అని నవమతి ముసిముసి నవ్వులు నవ్వింది.

అందరూ నవ్వలేక పొట్టలు చేతులతో పట్టుకొన్నారు.

నవమతికి కోపం వచ్చి, అక్కడినుంచి లేచి పెరటిలోకి వెళ్ళిపోయింది.

"ఇహ యిప్పుడు చెప్పండి." అన్నాడు మేనమామ బల్లగుద్ది.

అతనికి సమాధానం చెప్పలేక అందరూ రెండుచేతులా నోళ్లు మూసుకొన్నారు.

"నీమాట యేమిటే సత్యవతీ?" అన్నాడు మేనమామ.

"వాడికి లేని లోపం లోకంలోనే లేదు" అని మళ్లీ నవ్వు మొదలుపెట్టింది.

"మరి మీ చెల్లెలికి ఇష్టమయింది?"అన్నాడు మేనమామ,

"దానిమొహం. దానికేం తెలుసు, పసిది ఊరుకోండి!" అని సత్యవతి కూకలువేసింది.

"ఏమో, నువ్వు దానికి బోధించి చూడు" అన్నాడు మేనమామ చల్లగా.

బావమరిది తన బదులు మాట్లాడుతూన్న ట్టుగా తలచి నరహరిశాస్త్రి ఊరుకొన్నాడు.

సత్యవతి పెరటిలోకి వెళ్ళింది. నవమతికి అనేక విధాలుగా చెప్పింది "అ కురూపి మన కెందుకు? ఒక అందమా, చందమా! ఒక పెద్ద చదువా, పెద్ద ఉద్యోగమా? ఆస్తా, ఒక కుటుంబ సౌఖ్యమా!" అని ఎన్నో చెప్పి చూసింది. కాని నవమతి ససేమిరా మాన నంది. "చేసుకొంటే అతన్నే చేసుకొంటాను. లేకపోతే బ్రహ్మచారిణిగా ఉండిపోతాను" అంది ఆఖరిమాటగా.

"అయితే అలా గేఉండిపో!"అంటూ సత్య వతి కోపంతో వచ్చివేసింది.

కుమార్తెయొక్క పిచ్చి పట్టుదల చూసి తండ్రి [illegible]గారించేడు.

"నా కిష్టమైనది కాబట్టి నేను చేసుకోక మానను అని చెప్తూంది" అంది తల్లి.

అందరూ ముక్కున వేలు వేసుకొన్నారు. తరణోపాయంలేక ఆ పిల్ల ఇష్టం ప్రకారమే చెయ్యదలుచుకొన్నాడు తండ్రి. అతను తన ఆమోదాన్ని తెలియజేస్తూ, శుభముహూర్తాన్ని ఏర్పాటు చెయ్యవలసింది అంటూ లోకానందరావుకి ఉత్తరం రాశాడు.

"రేపు శనివారమే బయలుదేరి వస్తున్నాం. నాకు మళ్ళీ ఇంతటిలో సెలవు దొరకదు. మా బంధువులందరూ వస్తున్నారు" అంటూ లోకానందరావు జాబు రాశాడు.

మగ పెళ్ళివారు తర్లివచ్చేరు. ఏకరాత్రి వివాహం జరిగింది. తమకి రావలసిన దానిలో ఒక్క దమ్మిడీకూడా విడిచిపెట్టలేదు మగ పెళ్ళివారు. ఉభయఖర్చులూ నరహరిశాస్త్రి భరించేడు. పెళ్ళి ఐన వెంటనే పిల్లని తీసుకు వెళతానంటూ కూర్చున్నాడు లోకానందరావు.

"నాలుగురోజు లయేక తీసుకు వెళుదురు గాని ఇంకా మీరందరూ కొత్తకదా పిల్లకి" అన్నాడు మామగారు.

"ఇంతటిలో మళ్ళీ రావడాని కెక్కడ కుదురుతుంది" అన్నాడు లోకానందరావు.

"ఎందుకూ? మేమే తీసుకు వచ్చి దిగబెడతాం" అన్నాడు మామగారు.

"అదెలాగవుతుంది. ఇంటి దగ్గర ముసిలిది యెంతకని తంటాలుపడుతుంది? విస్తటిలోకి అన్నం వచ్చే ఉపాయముండవద్దా?" అని పట్టు పట్టేడు అల్లుడు.

విధిలేక ఒప్పుకోవలసి వచ్చింది. "అయితే పెళ్ళికూతురితో కూడ తోడుగా యెవరు వెళతారు?" అని అడిగాడు తండ్రి. యెవళ్ళకి వాళ్ళే "మా మాట పెడచెవిని పెట్టిందంటే మా మాడ పెడచెవిని పెట్టింది. మేము వెళ్ళమంటే మేము వెళ్ళం" అన్నారు. పెళ్ళికొడుకు పేరు చెపితే సత్యవతి అసలే మండిపడుతూంది.

"ఎవరేమనుకొన్నా నా మొగుడు నా మొగుడే!" అంది నవమతి.

"నుదటన్ వ్రాసిన వ్రాలుకన్న కలదా నూరేండ్లు చింతించినన్" అని విచారిస్తూ నరహరిశాస్త్రి నవమతిని ఒక్కర్తెనీ మగపెళ్ళివారితో పంపించివేశాడు.

# విజయవాడ రేడియో నాటకాలు

ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం వారు సుమారు ఒక సంవత్సరం నుండి చిత్రనళీయం, వీరబొబ్బిలి, పాండవోద్యోగ విజయాలు మొదలైన సుప్రసిద్ధ స్టేజి నాటకాల అనుసరణలను నెలకొకటి చొప్పున ప్రసారం చేస్తున్నారు. ఆ తరగతి లోనిదే గయోపాఖ్యానం. సెప్టెంబరు 29వ తేదే శనివారం రాత్రి 8 గంటల నుండి 9 వరకూ ప్రసారం చేశారు. ఈ నాటకాలన్నిటిలోనూ సుప్రసిద్ధ స్టేజి నటులు పాల్గొంటున్నారు. అంత వరకూ రేడియో అధికారులు అభినందనార్హులు. కాని, ఈ నాటకాలను, ఈ నటీనటుల గొంతుకలను వినడానికి విజయవాడకి దగ్గరలో వున్నవారి కంటే. దూరాన అంటే రాష్ట్రానికి కూడా దూరంగా, ఉత్తరానా దక్షిణానా వున్న తెలుగువాళ్లు ఎక్కువ కుతూహల పడుతుంటారు. ఆంధ్రదేశంలో వున్నవాళ్లు ఈ నాటకాలను అప్పుడప్పుడు స్టేజిమీద చూడగలరు. దూరంగా వున్నవాళ్లకీ అవకాశాలు లేవు. కాని, విజయవాడ కేంద్రం చాలా బలహీనమైన దవడం చేత మూడువందల మైళ్లు దాటితే సరిగా వినిపించదు. కొన్ని రేడియో సెట్లలో అసలే రాదు. కనుక ఈ విషయాన్ని గుర్తెరిగి రేడియో అధికారులు నెలకి ఒక్కసారే గనుక ఆ నాటకం వచ్చే గంటసేపూ మద్రాసు కేంద్రం నుంచి కూడా ప్రసారం చేసేలాగ చూడవలెనని కోరుతున్నాను. దీనితో రాష్ట్రేతరాంధ్రుల కుతూహలం నెరవేరడమే కాకుండా, ఇతర భాషలు మాట్లాడేవారికి కూడా మన నాటకాలలోని ప్రతిభ తెలియగలదు.

—జయంతి శ్రీరామమూర్తి